# పంచచామరం

కడుపునిండిన...బేరం!

--నిండుకుండ...అప్పుడే తొణకడానికి ప్రారంభించింది. ఒళ్ళుపొగరుకాకపోతే... చూస్తేనే...కడుపు నిండుతుందా?--

నిజంగా...ఆ అమ్మాయి అలానే ఉంది; అయితే మాత్రం? – ఎంత ఒంటరిగా కూర్చుని ఉంటేనేం... ఎగాదిగా చూస్తూ... ఎదురుగా దీపస్తంభాన్ని అనుకొని చదికిలబడటం నాకు అప్పుడు అదేం పోయేకాలం?.

ఏ రైలుకు వెళుతుందో?...

ఎటువెళ్ళినా...ఇంకా అరగంటదాకా ఎక్కడికీ బండిలేదుగదా?...ఇంతలో, కలిసి రావాలికాని...ఎంత గ్రంథం నడవకూడదు?--ఏమో తీరా, పాకానపడబోయే సరికి, అంతవరదాకా...అలా ఓచోట కూలేసి ఏ రాజ్యాలో ఏలబోయిన – ఆ ఘనుడు...మెడను త్రాడుబిగించిన ఎవరో ఆ వెధవాయ – తీరా తగుదునని ఆ సమయానికి అక్కడకు తయారైతే...మనం యిక అటూయిటూ మెసలడానికి ఏ మాత్రమూ వీలుండదు..మన వేషాలేమీ సాగవు...అనవసరంగా...సిద్ధాన్నం...ఆ కాస్తా చెడి ఊరుకుంటుంది.

అయినా, అందాకావచ్చినతరువాత..అప్పటిసంగతి చూసుకోవచ్చును. యిక యథావిధిగా కార్యక్రమానికి ఉపక్రమించవచ్చును...

ఎంతసేపు చూస్తూ కూర్చున్నా, బాగానే ఉంటుంది. యింకా...యింకా చూడాలనే ఉంటుంది.

నేను క్రీనీడలో ఉంటిని; వెలుతురు అంతా ఆ అమ్మాయిమీదకే ఉరుకుతూంది.

నా మనసు...

నే నలా...జపంచేస్తూ కదలక మెదలక ఎంతసేపు కూర్చున్నా, ఏం లాభం? – అక్కడ... ఆ రవంత దూరంలో తనకోసం ఒకడు తపించిపోతున్నాడని ఆమెకు ఆ ప్రాంతాల మనిషి అలికిడి అయినా... ఎలాగో తెలియాలి కాదూ, ముందు!

అందరికీ...తెలిసిన చిట్కా...గొంతుసవరించుకోవడం; నా శాయశక్తులా...ఎన్ని మాది రులలోనో... ఎన్నిస్థాయిలకో...ఆపకుండా దగ్గాను: జర్మనుభాష నేర్చుకుంటూన్నప్పటి కొరమారడం పంపిణీమీదనే...శబ్దించాను. ఊహుఁ...తననికాదన్నట్టు...తిరిగిచూడనన్నా చూడకుండా– ఆ అమ్మాయి అదివరకు చూసేవైపే...చూస్తున్నది–

అంతేనేమో ఎన్నటికీ రివాజు! వినిపించకుండా ఉంటుందా...నేను అంత సేపటినుంచీ అన్ని రకాలుగా గొంతుచించుకుంటూంటే? – పోనీ...అందులో ఏదో విశేషం ఉందని గ్రహించగల తాహతు లేకపోవచ్చును – కాని... ఎవరో

పాపం...ఎంత బాధపడుతున్నాడో అని...సామాన్యంగా అందరూ జబ్బువాడికేసి చూపించే...జాలి...అందుకని అయినా...నావంక తిరగవచ్చునే?

ఎందుకైనా మంచిది అని – కొంచెం ముందుకు జరిగాను...యిక మనలోపంలేదు... కనుముక్కుతీరు...నా నొక్కుల క్రాఫింగు యిత్యాదులు వెలుతురులో...స్పష్టంగా కనబడి తీరక తప్పదు–ఆమె, మెడనరాలు కొంచెం సడలించి యిటుచూసేపక్షంలో–

–'ఆ అమ్మాయి నావంక తిరిగిచూడాలి' – అనేది మాత్రంచేసి...దానికో వేయి వారువాల వేగం కలిపించి.. .మనసును మెలివేసి...కనుమూసి కనుతెరచేటంతకాలంలో లక్షసారులు జపించాను... ఆమీద కొసరుగా... పోనీ, పాపం అని మళ్ళా ఒకసారి...సత్తువకొద్దీ సకిలించాను–యింతకాండ జరిగినా... యింకా, వేసినచోటే ఉన్నాను.

తరువాత – ఎత్తు...

––ఆవైపునుంచి వెళుతూన్న కూలీకుర్రవాడిని పిలిచి, 'ఆమె, ఏరైలుకు వెళుతుందో కనుక్కో, వెంట ఎవరూలేకుండా, ఒంటరిగా వచ్చినట్టుంది, పాపం! టిక్కెట్టు ఏమన్నా తెచ్చిపెట్టాలో – ఏమో... అడుగు...'అని ఆమెదగ్గరకు తోలాను. వాడు...అక్కడకు వెళ్ళి నేను అడగమన్నదంతా – అక్షరం తప్పకుండా...నాకు వినపడేందుకు, బిగ్గరగా – ఒకసారికి నాలుగుసార్లు అడిగాడు. చివరకు, వాడికే విసుగువచ్చినట్టుగా ఉంది...తిరిగివచ్చి...చప్పరించి పెదవి విరిచాడు: నేను – పరధ్యానంగా తలఊగించాను – (అంటే...అక్కడ మళ్ళా కొంత లౌక్యం ఉంది: మనం ఏమాత్రమన్నా ఆదుర్దా కనబరుస్తే ...యిదేదో వ్యవహారం గదా అని వాడు పసిపట్టి, అటోయిటో తేలేదాకా అక్కడే తారటలాడుతుంటాడు: వాడిముడుపేదో వాడికి చెల్లినా...ఎట్లైనా...ఆవిషయం ఆ మరునిమిషంలో అలా అలా నాలుగుమూలలా ప్రాకి...అందరూ మనవంక అదోమాదిరిగా చూడటం...ఈగొడవేదీ లేకుండా...'ఏదో దయదలచి అడకూతురు ఒంటరిగా ఉన్నది కదా అని...కనుక్కోమన్నారే కాని, అయ్యగారికి అంతకన్న వేరే అభిప్రాయం ఏమీలేదు–' అని వాడనుకునేట్టుగా మనం అభినయించితే ఉత్తరత్ర ఏ చిక్కూ ఉండదు: అదీ సంగతి)–

అక్కడితో, ఆ ఆశకాస్తా మాయమైంది. ఇంక అనంతర కరణీయం బెయ్యది?

ఏదీ పాలుపోక...మళ్ళా మొదటికే వచ్చాను. అలా కూర్చుని, అదేపనిగా, ఏమిచేయడమా అని ఒకటే ఆలోచన.

అదేవరుసను 'కనబడ్డ అందరిచేత – అతి తెలివిగా రాయబారాలు నడిపాను: పళ్ళు అమ్మేవాడు – సోడా సాయెబు, బిస్కత్తులూ, నాన్‌రొట్టె ముసలివాడు – ఒకరేమిటి అందరినీ...నాకు అందుబాటులో వున్నవాళ్ళందరినీ...'అదిగో ఆ అమ్మాయి...అవి కావాలంటూంది, కనుక్కో'మని అక్కడికి తోలడం, వాళ్ళు తీరా అందాకా వెళ్ళి...ఆమెనడిగి...నేను పంపించానని నావంక చూపించి...ఏమాటా రాకపోతే...ఎంతసేపక్కడ అవతల బేరం చెడగొట్టుకుంటూ అలా నిలుచుంటారు గనుక...ఎగువకు వెళ్ళిపోవటం...యీలా, పుణ్యకాలం కాస్తా గడచిపోతూంది.

టిక్కెట్టు కలెక్టరు వచ్చి...తలుపులు తెరిచాడు. ప్రయాణీకులు ఒక్కరొక్కరే యివతలకు వస్తున్నారు. ఇంకా కొంచెంసేపటికి...అంతటా మనుష్యులే అవుతారు

– అప్పుడు మన ఆట ఇక సాగవు – యీలోగానే ఏమన్నా–

ఆమెకు కనబడేటట్లుగా...నాలుగుసార్లు అటూ యిటూ ఆమెముందునుంచే పచారుచేశాను.

ఆమెను నేనైతే పరకాయించిచూడటానికి బాగా వీలుచిక్కింది. కాని...ఆ అమ్మాయి...నావంక ఒక్కమారైనా చూడందే...

'అంత కొమ్మెక్కి కూర్చునేందు కేం – ఆకాశంనుంచి దిగివచ్చిందా, అబ్బో! చాలాదాకా ఉన్నదే...' అనుకుని విసువుతో...అటు వెళ్ళి టీత్రాగి, త్రాగుతూ మళ్ళా ఆలోచించాను.

ఎవ రా అమ్మాయి?

మనవైపులపడుచులాగా లేదు. కాని చూడటానికి మా మజాగా ఉన్నది–

ఆమెకు...అటూ యిటూ చూసే అలవాటన్నా లేదా... లేకపోతే అదంతా మన అదృష్టమా?

ఒకవేళ ఆ అమ్మాయి అటువంటిది కాదేమో?-- ఊహుఁ – అటువంటి వారంటూ ప్రత్యేకం ఉంటారా? – ఆ సమయం అంటూవచ్చి అన్నీ అలా ఒనగూడాలి కాని... అంతకుముందంతా అవనీ, కాకపోనీ...దిగడం...మూడునిముషాలు పట్టదు...అందుకు సరిఅయినవాడు దొరకాలి...కాని...

కాని...అవన్నీ మనం ఎదుకు కాకూడదు? – ఎందులో అయినా లోటా – అందం చందం...

ఏమిటో అన్నీ అర్థంలేకుండా – తలా తోకా కనబడని వెధవ ఊహలు: ఒకదానికొకదానికి సంబంధంలేదు... సబబూలేదు: కాని, ఆ వేడిమీద అవన్నీ తోచుతాయా? ఎదురుగా ఉన్నది – రంభ! ఏలా స్వర్గానికి ఎగబ్రాకటం? అంత వరకే!

అక్కడ... ఆ అమ్మాయిదగ్గర... చుట్టూ ఎవరో మనుష్యులు నిలుచున్నారు. బిగ్గరగా మాటలు వినబడుతూన్నవి; యిందాకటంతచేరువకు వెళ్ళకుండా'...కొంచెం అవతలగా నిలుచుని, ఏమిటా అని చూస్తున్నాను... ఆ అమ్మాయిదగ్గిర ఉన్న బట్టల మూటమీద ఒరిగి పడుకుని... వెక్కివెక్కి ఏడుస్తూన్నట్టుగా...పక్క లెగురటం... కనిపిస్తూంది; ఎవరో, ముసలాయన దగ్గిరగా గొంతుకూర్చుని, సముదాయింపుగా ఏదో చెపుతున్నాడు... ఎవరికితోకోచిన మాటలు వారంటూన్నారు. చుట్టూ ఉన్నవాళ్ళు––

"––బంగారంవంటి పిల్ల

"అలాంటివాడు, మరి పెళ్ళి ఎందుకుచేసుకోవాలి––

"––దీనిగొంతుకోయడానికి!

"––పాపం రంభలాగుంది! వాడికళ్ళకు యిది బాగుండలేదు – వెధవ–!

"––ఎక్కడిదేశం, ఎక్కడికెక్కడ! అడవిలో దించేసి వాడిత్రోవ వాడు చూసుకున్నాడు. ఆ చాకలిదానిమాత్రం చేయలేదు కాబోలు చేసుకున్న పెళ్ళాం––

"ఎందుకు చేస్తుందయ్యా...కండకావరం యిప్పుడదేమీ కనబడనీయదు...అది రేపు ఈపాటికి యింకోడిని తగులుకుపోతే...అప్పుడు ఎక్కడెక్కడ అని వైదక్కుంటూ మళ్ళా పెళ్ళాం కావాలని తయారవుతాడు."

"–పెళ్ళాం కావాలీ? – అసలు యిలాటి వెధవకు పిల్లనిచ్చినవాళ్ళని...పాత చెప్పొకటి పుచ్చుకుని, ఆ చెంపా యీ చెంపా వాయించాలి. ముందు – ఎన్నడూ యిలాటిపని చేసి ...అక్కు_నా అక్కు_నా అమాయకురాలి గొంతు కోయవుకదా – కోయవుగందా – అని"

"–వాడిని...కనబడితే...నిలువునా చీల్చినా పాపంలేదు–"

"–అఁ – ఇహ ఒకటే కనబడటం –మళ్ళా ఏముఖం పెట్టుకుని వస్తాడు: ఎక్క_డో కుళ్ళి కుతమారి..."

"ఆ అమ్మాయిపని అన్నిందాలా అధోగతి అయింది...దేశంకాని దేశం...మన మాటా మన మంచీ లేకపోయెను. యింతకూ ఆ పుణ్యాత్ముడెవరో కాని...యిన్నాళ్ళనుంచీ యింట్లోఉండి...అద్దె ఎగవేసి... అసలు శాస్త్రీ మాయమైనా – ఆ దండుగకు తోడు...యిప్పుడు బోలెడంత పోసి టిక్కె_ట్టు కొనియిచ్చి...చెంగునకట్టుకు, దోవలో వాడుకోమని, గుప్పెడు రూపాయలు, బతిమాలి, చేతిలో పెట్టాడయ్యా! కడుపున పుట్టిన బిడ్డకోసమన్నా మన మంత తాపత్రయపడం... పాపం! ఆ అమ్మాయికన్న ఎక్కు_వగా కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్నాడు...'అమ్మా, యిన్నాళ్ళనుంచీ మా యింట్లో పిల్లలాగా ఉన్నావు...వెళుతున్నావా' అని...'నీ కేం భయంలేదమ్మా...త్రోవపొడుగునా... ఎవరో ఒకరు నీకు సాయంగా ఉండి...నీ పుట్టింటికి జేరేదాకా...ఆ ఏర్పాట్లన్నీ నేను చేశాను... సుఖంగా వెళ్ళిరా మా తల్లీ...'అని...చూస్తూంటే నాకే ఏడుపు వచ్చింది––"

"అవును, ఎవరో ఒకరన్నా ఊరికి అలాటి ధర్మరాజులుండబట్టే...పచ్చికలి యింకా భగ్గుమనకుండా లోకం యింతమాత్రంగానన్నా ఉంది..."

"––లేకపోతే అందరూ ఆ మొగుడిలాటి పనికిమాలినవెధవలే అయితే...ఆడ వాళ్ళందరూ ఇక కట్టకట్టుకుని ఏ గంగలోనన్నా దిగవచ్చు––"

అవన్నీ – చుట్టూ నిలుచుని యింతదాకా చోద్యంగా చూస్తూన్నవాళ్ళు అనుకుంటూన్న మాటలు – వింటూంటే... వింటున్నకొద్దీ...నేను చేసిన దారుణం...తలకెక్కి_పోతూంది...

––చేసుకున్న మొగాడు మోసంచేసి...పొట్టచేతబట్టుకుని...యింతదూరం వచ్చి...యీ అధ్వాన్నపడవిలో పారేసి...అతీగతీచూడకుండాపోతే...పుట్టెడుదుఃఖంతో రాయై...కదల మెదలకుండా... ఆ అమ్మాయి అక్క_డ పడిఉంటే...నేను చూసి లొట్టలువేశాను...!

ఏమేమో చేదామని చూశాను...కాదూ, నేను...మీసంఉన్న మగవాడిని...పెద్ద మనిషిని... నలుగురిలో మెలగనేర్చినవాడిని...

అవతల...ఆడది––

నేను––మగవాడిని...ఛీ...

తెగ్గోస్తే...కోసే కత్తికికూడా...నా పాపం చుట్టుకోదూ...నిజానికి...ఏమిటి నా ఊహ... ఏంచేదామని...కాస్సేపు...ఆ పిల్లతో...కళ్ళతో చెలగాటమాడి...రైల్లో ఎక్కే_దాకా చూసి...చూసి, ఏదో ఘనకార్యంచేసినవాడిలాగా యింటిదాకా...కూనిరాగంతీసుకుంటూ నడచి...అనవసరంగా... ఆ ప్రస్తావన క్లబ్బులో...తీసుకువచ్చి... అక్క_డ మన ప్రతాపం అందరితో చెప్పి...అంతేనా...

పోనీ, మాటవరుసకు...ఆ అమ్మాయి...నా అంత సుందరుణ్ణి ఎన్నడూ కలలోనైనా చూడనంత తలకుమాసినదై –సై౯ – అన్నదంటే మాత్రం...అప్పుడు అమాంతం అపాళాన రైలుఎక్కి... అంత తాహతు ఉందా? – ఊహు౯ –

గడుసరిదై – మామూలు ధోరణిలోనే ఉండి...మనవాలకం చూసి...కంతుమని లేచినట్టాయెనా...యిక మళ్ళా మరునాడు ఊళ్ళో తల ఎత్తుకు తిరగవీలుందా–

ఆ చేసుకున్న వెధవకన్న నే నేం మెరుగు?––

యీలాంటి వెధవలు (మన్నికూడా కలుపుకుని) ఉండబట్టే...యిలా తగులబడు తూంది; యింకా తగులబడుతుంది––

––రైలు ఏనాడో వెళ్ళిపోయింది...

దోవపొడుగునా...నన్ను నేను దులుపుకుంటూ...ఎన్ని గుణపాఠాలో నేర్చుకుంటూ... అంతకుపూర్వం నేర్చుకుని మూలపడవేసినవి మళ్ళా నెమరుకు తెచ్చుకుంటూ...క్రమంగా నేను–నాలోకి – నాలోనుంచి ప్రపంచంలోకి...ప్రపంచంమీదనుంచి పరమాత్మ మీదకి...అక్కడనుంచి మళ్ళా ఒక్క విసరున ఆత్మమీదకీ...పుణ్యం–పాపం...చీకటిలో – వేదాంతమార్గాలన్నీ గుర్తులు పెట్టుకుంటూ, పట్టాలవెంబడి నడచి...రోడ్డుఎక్కి మళ్ళా వెలుతురులోకి వచ్చాను...

సోడా ఫౌంటెన్ దగ్గిర...డ్రింక్ మీద డ్రింకు...కడుపునిలువునా చల్లబడి...గుక్కమీద గుక్క... సిగరెట్ తో కళ్ళలోకి తెలివివచ్చి...ప్రొద్దుపోతున్నదికదా అని...సత్తువతో కాలుసాగించుతూ...

ఆ మేడముందు...పున్నాగచెట్టునీడను, గేటును అనుకుని...క్రీనీడలో తెల్లచీరె... తళుక్కుమని చూచాయగా కమ్ములూ...తలలో మల్లెపూలున్నట్టుగా గురుతూ – అంతదూరాన్నుంచే కంటికి తగిలేటప్పటికి...

అలవాటుచొప్పున...

అంతామరచిపోయి...

అమె ఎవరో...అక్కడనుంచే కదిలిన తరువాత... వెలుతురులోకి వస్తే...ముఖమన్నా కనబడుతుందికదా అని...

వెధవ అలవాటుచొప్పున – అక్కడ అగాను ఓ క్షణం.

★ ★ ★